# అదనం కోత

ఆ మాట అకౌంటెంటు చెప్పగానే మిన్ను విరిగి మీదపడ్డట్టు అయ్యింది. కళ్లు బైర్లు కమ్మాయి. నిజంగానే భూమి గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. నోట మాటరావడంలేదు. చేతికి పట్టుచిక్కడంలేదు.

అదనంకోత ఇరువది రూపాయలు పోగా చేతికొచ్చిన జీతం రాళ్లు కొంటె కొంటెగా వెక్కిరిస్తున్నాయి.

అన్ని కోతల వాటుపడ్డ ప్రాణానికి ఈ జీతం కోత విపరీతమైన బాధాకరం అనిపించింది. పుండుమీద దెబ్బకు ప్రాణం విలవిల్లాడి నట్ల య్యింది. కోట్లకోట్ల భూకంపాలు తన ప్రాణాల క్రిందనే బ్రద్దలవుతున్న ట్లనిపించింది.

ప్రావిడెంటు ఫండ్ క్రింద జీతం కోసినప్పుడు మొదటి నెలలో పడ్డబాధ తానంతటదే అలవాటుక్రింద మారిపోయింది. బాధపెట్టటము మానేసింది.

ఈ కోత శాయశక్తుల తప్పించుకుందామని చూశాడు. నెమ్మది గానే ఎదిరిచూశాడు. ప్రతిఘటించటము రాదు గనుక తననైనా మినహాయించమని వేడుకొన్నాడు. పిల్లవాళ్ల జ్వరాలు, మందుల ఖర్చులు, పాతఅప్పులు, భార్య ప్రసవం వగైరా సాకులు చెప్పాడు. రామ బాణములా పని చేస్తాయనుకున్న సాకులన్నీ కుంటిసాకులయి పోయినయి. గాలికి దూదిపింజల్లా ఎగిరిపోయినాయి.

"పై వాళ్ళు మాకు కోటా యిచ్చారు. ఇదిమేము నీకిచ్చేకోటా. ఊర్లో హెడ్ మాష్టరువి. ఈ మాత్రము చేయలేవా?" బీడివోగారు దృఢస్వరంతో అన్నాడు. ఈ ముద్దెర భుజం తప్పినా వీపు దప్పదన్నట్లుగా!

"ఊళ్లో మా మాట ఎవరువింటారు సార్."
"పిల్లల తండ్రులు కంటగట్టవయ్యా పిచ్చిపంతులూ."
"ఇవి పరీక్షల రోజులుకూడ కావుసార్"

"ఇదంతా నా కనవసరం. నీవుపడే బాధేదో నువ్వుపడు. నా బాధను నే నెవరితో చెప్పుకునేది. నా కోటా నే నెలా పూర్తిచేసేది." అని కాగితాలలోనికి తలదూర్చాడు. రామపట్టాభిషేకములోని హనుమంతుడిలా నిల్చునివున్న చప్రాసివంక చూశాడు. చప్రాసి మాత్రము సహజ మర్యాదలతోనే ఇవతలకి తీసుకవచ్చాడు. నెత్తి గోక్కుంటూ ఇవతల పడ్డాడు.

## 2

ఆఫీసులోనుండి అడుగు ఇవతల పెట్టాడా లేదా ఉసిల్ల పుట్టలాగా ఆలోచన పరంపరలు రాసాగాయి.

మెడనపడ్డ పాము కరువకమానదు. తనకోటా ఎవ్వళ్ళ కంటగడితే తన బాధ తప్పుతుందో నెమరువేసుకోసాగాడు. చేతిలోవున్న ప్రభుత్వము వారి లాటరీ టిక్కెట్లు మోయరాని బరువనిపిస్తున్నాయి. బహుశా వాటిలో వున్న లక్షల లక్షల రూపాయలు వస్తాయన్న ఆశాపాశాల బరువు కావచ్చు.

పైవాడి కోటాబరువు క్రిందివాడి మీదికి, క్రిందివాడు తన క్రిందివాడి తలమీదికి ఆ భారాన్ని బదిలీచేయాలి. ఈ అంతరార్థాన్ని కొట్టవచ్చినట్లు చెప్తున్నాయి లాటరీ టిక్కెట్లు.

ఊళ్ళో అడుగుపెట్టూనే దుకాణాలవైపు దారితీశాడు. భోజనముచేసి బొమ్మన్న అలి మాటలు అర్థాంతరంగానే ఉండిపోయాయి. తన పెట్టుబడి నెలాగయినా వెళ్ళతీసుకోవాలి. పెట్టిన పెట్టుబడిమీద తనకు లాభాన్ని రాబట్టుకోవడం తన కధర్మం. కాని తను ఆ పాపానికి వడిగట్టుకోవడం లేదు. అలా చేయగలిగిన పరిస్థితిలో కూడా లేడు. దీని స్వభావమే అలాంటిది కాదు. వీలయినంత త్వరలో చేతులుకడుక్కొని అవతల పడాల్సిన బేరము.

అదృష్టాన్ని పరీక్షకు పెడితే, యెవడో వొకడు గెలిచి బయట పడకపోడు. నేటి బ్రతుకే ఒక పోటి. ఏమైన యేదైనచేసి పోటీలో నెగ్గిన వాడే ప్రయోజకుడు. అలా చేయలేనివాడు అప్రయోజకుడు, అమాయకుడు, అచ్చువేయని విగ్రహం. లాటరీ ఒక కాలంలో ఎవరేమనుకున్నా యేం ఫర్వాలేదు కాని, నేడు మాత్రము యిది ఒక దేశభక్తి కర్మ. అడుక్కోవడం, అమ్మడం రెండూ దేశభక్తి సేవలకి భాగాలే. దీనికి ప్రోత్సాహక శక్తి అమాంతము లక్షాధికారి అయ్యే అదృష్టము పడ్తుందన్న ఆశ. దేశభక్తికూడ యిలా అందరికీ వ్యాపారంలో అందుబాటులోకి వచ్చింది, కాలమహిమ అనుకుంటూ నడుస్తున్నాడు. అరవై మైళ్ళ వేగముతో పోయే లారీ హారన్ మ్రోతతో అదిరిపడి మళ్ళీ ఈ లోకంలో పడ్డాడు. తనకు ఖాతపెట్టే దుఖాణం యజమాని నడిగాడు. ఒక్క రూపాయి లాటరీ టిక్కెట్టు కొని లక్ష రూపాయలు సంపాదించుకోమని నోరూరేటట్టుగా చెప్పాడు. కాని నోరూరకుండానే చెవు లూడగొట్టారు సేల్సుటాక్సువారు. అంతకుముందే టిక్కెట్లనంటకట్టిపోయారట. పరిచయమున్న వ్యాపారస్తులంత యిదే మాట చెప్పారు.

ఆనాటి వేళకన్నా ముందే స్కూలుకు వెళ్ళాడు. ఇంకా స్టాపు మెంబర్సు ఎవ్వరు రాలేదు. ఎవ్వళ్ళు వచ్చేవేళకు వాళ్ళు రాసాగారు. ఎప్పుడొచ్చినా తన గదిలో ఉండి అటెండెన్సు రిజిష్టరులో సంతకము పెట్టటానికి రావలసినవాళ్ళే. తనకూ, వాళ్లకు సంబంధము కలిపే లంకే అది.

తన దగ్గరున్న లాటరీ సరుకును అమ్మకానికి పెట్టాడు. స్కూళ్ళ డిప్యూటీ ఇన్స్పెక్టర్ తనకన్న ముందే ఆ అవకాశాన్ని అందుకున్నాడు. జీతాలు వచ్చాక డబ్బు యివ్వమన్న ఆదేశంతోటి టిక్కెట్లు అప్పగించి పోయాడట. పైగా అగావు సరకు ఉద్దెరయిచ్చి ఉద్ధరించాడు. తనదేమో నేడు నగదు, రేపు ఉద్దెర అని గోడమీద రాసి పెట్టుకున్న బేరం. ఉన్న నాలుగు క్లాసుల్లో కాస్త తింటూ గడుస్తున్న విద్యార్థులకు తన దగ్గర ఉన్న సరుకు విడుదల చేశాడు. తల్లిదండ్రుల నడిగి డబ్బు తెమ్మన్నాడు. మధ్యాహ్నానికే తనసరుకు తనకు వాపసు వచ్చేసింది. రెవిన్యూ ఇన్స్పెక్టర్

ఎప్పుడో తన సరుకును తానంటగట్టాడట. ఈ అదనం భారం మోయ లేమన్నారు తల్లి దండ్రులు.

ఆ రోజు తాను పాఠాలు చెప్పలేకపోయాడు. ఉన్నసరుకును ఎలా అమ్ముకోవాలా అన్నతాపత్రయముతోనే సరిపోయింది. డ్యూటీలో ఉండి కూడా డ్యూటీచేయలేదురాబాబు అని చచ్చిపోకుండ బ్రతికున్న అంతరాత్మ ఘోషించింది. దిగులుబడ్డ మొహంతో కొంపచేరుకున్నాడు. గుండెలో అగ్నిపర్వతములా బాధా, కోపము రెండూ పెనవేసుకున్నాయి. ఎప్పు డేవేళప్పుడు ఎవరిమీదకు విరుచుకపడ్తాడో ఏమో ? తనకు తాను సదుమా యించుకున్నాడు.

భార్యను చూడగానే బయలు ఉబికివచ్చాయి. ప్రతి అసమర్థుడు చేసే పనేగదా అని లోలోపలే మ్రింగుకున్నాడు. భార్య వెంటనే పసిగట్టి అడిగేసింది.

"జీతం దొరికిన మొదటిరోజే యిలా ఉన్నారు యేమిటీ సంగతి ?" ఆ ఉగ్ర నరసింహావతారము పూనకంలో ఉన్నట్లుగా తనను యెగాదిగా చూసింది. నాల్గోవారంలో ఉండాల్సిన పెరరిస్టు అవతారంలో మొదటి వారంలోనే యెందుకో ప్రత్యక్షమైనట్లు యేమిటీ వ్యథ. అనుభవంతో కూడిన ఆమె చూపులు అదేపనిగా అడుగుతున్నవి. నోరు తెరవకుండ ఉంటేనే మర్యాద దక్కుతుందనుకున్న మానవుడు తిరుగుజవాబివ్వలేదు. ఆ దినం అలా ముభావంగా గడిచిపోయింది. మూడు రోజులైనా ఒక్క టిక్కెటైన కొనేవాడు పుట్టిరాలేదు. లోకం గొడ్డుపోయినట్లనిపించింది. వేటాడబోయి వట్టిచేతులతో వచ్చిన ఆటవికునిలా వుంది తన మానసిక పరిస్థితి.

ఎడారిలో వయాసిస్సులాగా యెదురుగుండా పోలీస్ స్టేషన్ కని పించింది. మొదటిలో మెరపు మెరసినట్లయింది. విముక్తి, విమోచన మార్గాలు కనిపించినట్లనిపించింది. మంచి ఆదాయంగల స్టేషన్ అని దానికి పేరు. ప్రతివాడు అక్కడికి బదిలీ కావాలని ప్రయత్నిస్తాడు. పెద్ద పెద్ద వాళ్ళ సిఫార్సులు తెచ్చుకుంటారు. మంత్రులే తమ వాళ్ళను అక్కడ ప్రతిష్ఠించుకోవడానికి పోటీపడ్తారు. పల్లెనుండి పట్టణాలు, నగరాలదాకా

25093
25093
Acc. No



ఆదా పంపిణి చేసే వ్యవస్థ అది. తన భారాన్ని తొలగించే తరుణోపాయంగా కళ్ళముందగు పడుతున్నది. ఏ నాలుగు లారీలవాళ్ళ కంటగట్టినా తన బరువు అలకనై పోతుంది. తానూ పోలీస్ సబ్ఇన్స్పెక్టరుగారూ చీట్లాటలో పార్ట్నర్స్, డిన్నర్సులో కూడ అప్పుడప్పుడు హాజరు పడుతుంటుంది, ఈ స్నేహితం కూడ తన పలుకుబడికి పరాకాష్ట అని పొంగిపోయేవాడు అప్పుడప్పుడు.

గబగబ స్టేషన్‌లోకి వెళ్ళాడు. నీవేతప్ప యితః పరంబెరుగనని విముక్తి మార్గాన్ని అర్థించాడు. కాని అక్కడ కూడా కట్టలు కట్టలుగా ఉన్న లాటరీ టిక్కెట్లు ప్రత్యక్షదర్శన మిచ్చాయి. కామితార్థాన్ని ఇస్తుందన్న కామధేనువు యెగజేపినట్లయింది.

మిత్రుణ్ణి నిరాశపాలు చేయకుండ పంపడానికి, మర్యాద దక్కించుకోవడానికి యస్. ఐ. గారొక మాటమాత్రం అన్నారు. "టిక్కట్లక్కడే ఉంచు, మా కోటాతోబాటు దీన్నికూడ డిస్పోజు చేయిస్తాను. అమ్ముడుపోకపోతే మాత్రము వాపసు తీసుకునే షరతు."

ఈ మాత్రము మాటలు జీవిగంజి పోసినట్లంది. ఆశనిరాశలు కట్టగట్టుకొని ఒక్కసారిగా దాడిచేసినట్లయింది. యెలాగైతేనేం భారం దిగిపోతుంది. పెట్టిన పెట్టుబడి నిధి కాలేదు కాని వేరే విధంగా అయితే? అమ్ముడుపోక పోతే యిన్నిటికట్లు? యిన్ని లక్షల రూపాయలు యిక్కడ వదలిపోవలసిందే? కొంపదీసి ఈ నెంబర్లే డ్రాలో వస్తే? అమ్మబాబోయ్ యింకయేమైనా ఉందా? పోలీస్ వాణ్ణి నమ్మిందెవరు? లక్షల డబ్బు. 'అడదాని జూడ అర్థంబు జూడంగ బ్రహ్మకైన బుట్టు రిమ్మతెగులు'— చదివి మరిచిపోయిన పద్యం జ్ఞాపకం వచ్చింది. పర్యవసానం ఆలోచించు కుంటే కింకాంగు గదా దండం నెత్తి మీద బాదుతున్నట్లయింది. నాగాసాకీ హిరోషిమా ఆటంబాంబులు తన చుట్టూ పేలుతున్నాయి. మూడో ప్రపంచ యుద్ధం అమెరికా రష్యాలు రంగంలోకి దిగాయి. ఇంకేముంది అంతా సర్వనాశనం.

ఈ భావనా స్రవంతి ప్రవహించి ఒకే నిశ్చయానికొచ్చింది. యెందుకైనా మంచిది యెవరి సరుకు వాళ్ల దగ్గరఉండడమే వుత్తమం, క్షేమం, ఒక నెల జీతంలో అదనపు జీతం అనుకుంటాడు. ఇనిస్పెక్షన్‌కు వచ్చినయే అధికారి కొరకో ఖర్చయిందను కుంటాడు. లేదా చీట్లాటలో నష్టం వచ్చిందని సరిపెట్టుకుంటాడు, యేదేమైనా సరుకు మాత్రం తన దగ్గరే ఉంచు కుంటాడు.

మనస్సులో యిలా స్వయంపాకం జరిగిపోతున్నది. ఐదు నిమిషాలైనా ఏ జవాబు రాకపోవడంతో "యేమిటి ఆలోచిస్తూన్నారు." అన్నాడు పోలీస్ యస్. ఐ.

"అబ్బే యేమీలేదూ ఇంటికెళ్ళి టికెట్లు పంపిస్తాను." తన జేబులో వున్న టికెట్ల సంగతి కనిపెట్టే రాడార్ యంత్రం లాంటిది యీ పెద్దమనిషి దగ్గర లేదన్నట్లుగా నిశ్చితంగా చెప్పి బైట పడ్డాడు.

కొండకెదురు చూసినట్లుగా చూసిన లాటరీ డ్రా తేదీ రానేవచ్చింది. సరకు మారకానికి ప్రయత్నాలు జరుపుతూనే వచ్చాడు. ప్రయత్నం చేసినప్పుడొకబాధ, యత్నం విఫల మయ్యాక ఇంకో రకమైన బాధ అనుభవిస్తూనే వచ్చాడు.

టికెట్లన్ని నెంబర్లవారిగా తన పేర, భార్య పేర, పిల్లల పేరన పంచి వేశాడు, యెవరి పేరుబలంలో ఏ యోగం వుందో ? యే పుట్టలో యే శేషుడున్నాడో ? కథల్లో అదోలాగా జాతక చక్రంలో బృహస్పతి పద కొండో స్థానానికి రావచ్చు ! యే గడియ ఎలాంటిదో ? యెందుకయినా మంచిదని పంపకాల సంగతి భార్యా పిల్లలకు గూడా చెప్పలేదు.

పత్రికల్లో దిన వార ఫలాలు వరుస తప్ప కుండా పారాయణం చేస్తున్నాడు. పత్రికలంటేనే పొలిటికల్ చెత్త తలనొప్పి అని అవతల పారేశేవాడు. అమాంతంగా, హఠాత్తుగా వచ్చిన యీ మార్పుకి తోటివాళ్లంతా ఆశ్చర్య పడుతున్నారు.

సాయంత్రం ముఖ్యమంత్రిగారు లాటరీ తీస్తారు. ఫలితాలు వెంటనే స్థానిక వార్తల్లో ప్రకటిస్తారని వార్త మోసుకొచ్చింది రేడియో.

ఆఖరి పిరియడు ఎగ్గొట్టి కొంప చేరుకున్నాడు. ఐదున్నర గంటలకే రేడియో ముందు కూర్చున్నాడు. విజయవాడ నుండి వచ్చే శాస్త్రీయ సంగీతాన్ని ఓపిగ్గా వింటున్నాడు. సినిమా పాటల కోసం వేరే స్టేషన్ పెట్టడానికి వచ్చారు పిల్లలు. వాళ్లందరిని దబాయించి తరిమేశాడు. సాయంకాలం 6 గంటల కొచ్చే ఇంగ్లీషు వార్తలు యెంతకూ ముగిసినట్లనిపించలేదు. ఐదు నిమిషాలకు బదులు పదిహేను నిమిషాలు మిడికేటట్లున్నాడు. స్థానిక వార్తలు రాకుండా మధ్యలో ఆషాఢ మాసంలాగా వీడేమిటి అనుకున్నాడు. చదివేవాడెదురు గాలేడు కనుక బతికి పోయాడు. లేకుంటే గొంతు పిసికి గోడవతల పారేసేవాడు.

ఈ లోగా స్థానికవార్తలు చదుతున్నది ఫలానా అన్నమాట వినిపించింది. పంచేంద్రియాలు నవనాళ్ళు బిగించి కేంద్రీకరించి వింటున్నాడు. రెడీ రిఫరెన్సు కోసం తన టిక్కెట్లు నెంబర్లు రాసిపెట్టుకున్నాడు. బహుమానాలు వచ్చిన నెంబర్లు ప్రకటిస్తుంటే కొడుకు జేబులోవున్న పెన్ను లాక్కున్నాడు. సినిమా పాటలు విననియ్యనందుకు కక్షగా పెన్నివ్వనన్నాడు వాడు. రెండు మొట్టికాయలేశాడు. వాడు ఆరున్నొక్క రాగాన్ని అందుకున్నాడు. అమాంతం వాన్ని అవతల యెత్తేసి గబ గబా వచ్చాడు. ఫలితాల్లో వచ్చిన నెంబర్లు నోట్ చేసికున్నాడు. ఆశ్చర్యం తన నెంబర్లే వచ్చాయికాని ....తన వరస నెంబర్లు ఇంగ్లీషుKసీరీసువి. ప్రకటించిన నెంబర్లు L సీరీసువి. అయ్యో గ్రహచారం అని కేకేశాడు. కొద్దిలో తప్పిపోయింది. అక్షర సమామ్నాయంలో కే ఆ తర్వాత యల్ వస్తుందా; లేక యల్ తర్వాత కే వస్తుందా. ఎ నుండి జడ్ దాకా తిరిగేసి మళ్లేసి ఏ బి సి డి లు చదువుకున్నాడు. ఎన్నిసార్లు చదివినా కే తర్వాత యల్ వస్తున్నది. యల్ కు బదులు కే అని నోటుచేసు కున్నాడేమోనని అసలు లాటరీ టిక్కెట్టు చూసుకున్నాడు. ఎన్నిసార్లు చూసుకున్నా భృకుటి మధ్యంలో దృష్టినిలిపి చూసుకున్నాడు కూడ, అది యల్ సీరీసు కానే కాలేదు. తనను తన అదృష్టాన్ని వెక్కిరిస్తున్నట్లుగా కే కే లాగానే వుండిపోయింది.

లక్షలలక్షల రూపాయల వర్షం ఆకాశాన్నుండి తన యింటిలోపడి వాగులో కలిసి సముద్రం పాలైపోయినట్టనిపించింది.

ఒక్క అక్షరంలో తప్పాయి నా లక్షల రూపాయలు అని వెర్రిగా కేక వేశాడు. చెట్టుకూలినట్లుగా నిలువునా కూలిపోయాడు. సోయిదప్పి పోయింది. భార్య వచ్చి మొహాన నీళ్ళుజల్లినా స్పృహరాలేదు. డాక్టరువచ్చి సూదిమందు పొడిచాక గాని మన ప్రపంచంలోకి రాలేదు. వారంరోజుల సెలవు ఖర్చయింది. జీతం రాకముందే పదిహేను రూపాయల వైద్యంబిల్లు ప్రత్యక్షమయింది. ఇది ఇంకో అదనంకోత అని బిల్లు చూసుకున్నాడు. మిన్ను విరిగి మీదపడ్డట్టయింది. కండ్లు బైర్లుగమ్మాయి. నరాలు జివ్వు మంటున్నాయి. చెవుల్లో అదనంకోత అన్నమాట ప్రతిధ్వనించింది. *

(1972)